క్లుప్తంగా

క్రీడల్లో మోగులూరు జెడ్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



మోగులూరు(కంచికచర్ల): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించటంతో పాటు క్రీడా రంగంలో మంచి తర్ఫీదు ఇస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు తంగిరాల రాంబాబు తెలిపారు. మండలంలోని మోగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయిలో క్రీడా విభాగంలో మంచి ప్రతిభ కనపర్చిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ మేరకు హెచ్ఎం మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో నందిగామలో సీనియర్, జూనియర్ విభాగాల్లో పలు ఆటలు పోటీలు నిర్వహించామన్నారు. సీనియర్ బాలికల విభాగంలో ఖో ఖో పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఆయేషా, ఆర్షియానాజ్, బాలుర విభాగంలో మహ్మద్ రేమాన్‌లు పాల్గొని ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న పీఈటీ షేక్ మెహబూబా, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వెండి తాపడం పనులకు రూ.50 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం పనులకు గొల్లపూడికి చెందిన ఆలపాటి సాంబశివరావు, జయలక్ష్మి దంపతులు రూ.50 వేలను ఆలయ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణమోహన్‌కు మంగళవారం అందజేశారు. అలాగే తెలంగాణరాష్ట్రం, ఖమ్మం పట్టణానికి చెందిన మద్దుకూరి శ్వేతా చౌదరి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి రూ.15,116లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు.

మాగల్లులో న్యాయ విజ్ఞాన సదస్సు



మాగల్లు(నందిగామటౌన్): సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా మండలంలోని మాగల్లు ఖాసీం-ఖాసీం వృద్ధాశ్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగిందని నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబూ విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రేష్మ పాల్గొన్నారు. ముందుగా సీనియర్ సిటిజన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు న్యాయమూర్తి మాట్లాడుతూ.. వృద్ధుల రక్షణకు 2007 చట్టాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు కరీముల్లా, న్యాయవాదులు షేక్ ఆజాద్, కొమ్మినేని మాశేశ్వరరావు, కోయ దివ్య, వేల్పుల ప్రభాకరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు కానుకగా ఎమ్మెల్సీని గెలిపించి ఇద్దాం



జగ్గయ్యపేటఅర్బన్: జగనన్నకు కానుకగా ఎమ్మెల్సీని గెలిపించి ఇద్దామని రాష్ట్ర వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతమ్ రెడ్డి అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ఆయన నివాసంలో ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రుల రిజిస్ట్రేషన్ విధానం, ఓటింగ్ తదితర అంశాలపై ఏర్పాటుచేసిన పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల అవగాహన సమావేశంలో గౌతమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ ఎన్నికలు జరిగినా మనమే ముందుడాలని తెలిపారు. తన్నీరు నేతృత్వంలో పార్టీ శ్రేణులంతా ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. గౌతమ్‌రెడ్డిని గెలిపించుకుందామని తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. సమావేశంలో విజయవాడ కనకదుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఫిరోజ్‌ఖాన్, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన గురువారం జరుగుతుందని ఎంపీడీఓ సాయిహర్ష మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

తక్షణమే ఇసుక క్వారీలు తెరిపించాలి

- భవన నిర్మాణ కార్మికుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయాల వద్ద కార్మికుల నిరసన



కంచికచర్లలో ఆందోళన నిర్వహిస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

జుజ్జూరు(వీరులపాడు): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇసుక క్వారీలను తెరిపించి ప్రజలకు అందుబాటులో ఇసుక ఉండేలా చర్యలు తీసుకోవాలని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యలయం వద్ద మంగళవారం ఇసుక క్వారీలను తెరవడంతో పాటు సంక్షేమ బోర్డును యథావిధిగా అమలు చేయాలని కోరుతూ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇసుక అందని ద్రాక్షగా మారిందన్నారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విజయరావు, సభ్యులు తిరువల శెట్టి సత్యనారాయణ, జనేపల్లి స్వామి, మర్రిపూడి చిన్నా, షేక్ ఖాజాపీర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: ఇసుక క్వారీలను తెరిపించాలని, అందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. తహసీల్దార్ ఏ.శాంతికల్యాణికి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు నష్టపరిహారం వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.హరికృష్ణారెడ్డి, నాయకులు మర్రిపూడి పూర్ణచంద్రరావు, పెనుగొండ గోపి, సీహెచ్ తిరుపతిరావు, కొండలరావు, దేరంగుల శ్రీను, గురుస్వామి, పుల్లారావు, డి.తిరుపతయ్య, బి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో తహసీల్దార్ శాంతికల్యాణికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కంచికచర్ల: ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 100 రోజులైనా ఉచిత ఇసుకపై ఖచ్చితమైన నిర్ణయాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రకటించలేదని భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి హరికృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఇసుక క్వారీలు తెరవాలని ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలోని 35 లక్షల మంది భవన నిర్మాణ రంగ కార్మికులు పస్తులు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.15 వేలు తక్షణ సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వి.జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ రంగ కార్మికులు స్వామి, పూర్ణచంద్రరావు, ఆంజనేయులు, శ్రీను బడేటి దాసు, పులి స్వాతి, పులి శ్రీను, కాకుమాను రామారావు, పల్లె రాయప్ప పాల్గొన్నారు.

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఇసుక ఆన్‌లైన్ విధానం భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడే విధంగా ఉందని మంగళవారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనుమంచిపల్లి ఇసుక యార్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలకంఠం శివప్రసాద్, అంబోజి శివాజీ, పోతిపాక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పాత విధానంలోనే ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేయాలన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే తాతయ్య, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు.

వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

వీరులపాడు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నూరు శాతం అందించే బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీఓ అరుంధతీదేవి పేర్కొన్నారు. వీరులపాడు ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో మొత్తం 8,789 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. పింఛన్ పంపిణీలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొంటున్నారని చెప్పారు.

93 శాతం పింఛన్ల పంపిణీ..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని రకాల పింఛన్లు 93 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఎం.రమేష్‌బాబు మంగళవారం పేర్కొన్నారు. 21 సచివాలయాల్లోని లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్ అందజేశారని చెప్పారు.

పింఛన్ నగదు లబ్ధిదారులకు అందేలా చూడాలి

కంచికచర్ల: ప్రభుత్వ సామాజిక పింఛన్లు లబ్ధిదారులందరికీ అందేలా అధికారులు చూడాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ.. కంచికచర్ల మండల పరిధిలో మొత్తం 10,308 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. తొలి రోజున 9,600 మంది లబ్ధిదారులకు పింఛన్ అందజేశామని చెప్పారు. మిగిలిన లబ్ధిదారులకు రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీఓ తెలిపారు.



గండేపల్లిలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ రవికుమార్, నాయకులు

ముంపునకు గురైన పంటలకు పరిహారం అందజేయాలి



చందర్లపాడు(నందిగామటౌన్): వరద ముంపునకు గురైన పంటలను నమోదు చేయకుండా అధికార పార్టీకి చెందిన నాయకులు చెప్పిన పొలాలనే అధికారులు నమోదు చేశారని జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు పేర్కొన్నారు. చందర్లపాడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆశియానాయక్‌కు మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు వరదలు వచ్చి రైతులు సాగుచేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. మండలంలోని కొడవటికల్లు, పున్నవల్లి, కాండ్రపాడు, కాసరబాద, పొక్కునూరు, గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయని ఆ పొలాల్లోని పంట వివరాలను నమోదు చేకుండా టీడీపీ నాయకులు చెప్పిన సుబాబుల్ పొలాలను నమోదు చేయటం బాధాకరమన్నారు. అటువంటి అధికారులపై చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని లేకుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, కొండా కృష్ణారెడ్డి, కందుల నాగేశ్వరరావు, గుడేటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రులకు చురుగ్గా ఏర్పాట్లు



శ్రీతిరుపతమ్మవారి ఆలయం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్ కుమార్ మంగళవారం తెలిపారు. అక్టోబర్ 3వ తేదీ ఉదయం 8.40 నిమిషాలకు శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అక్టోబర్ 9న మూలానక్షత్రం సందర్భంగా సరస్వతి పూజ, అక్టోబర్ 10న దుర్గాష్టమి సందర్భంగా చండీహోమం, అక్టోబర్ 11న ఉదయం మహర్నవమి, సాయంత్రం పూజ అనంతరం కూష్మాండ బలిప్రదానం, ఉద్వాసన, అక్టోబర్ 12 విజయదశమి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో శమీపూజ, ఆయుధపూజ జరుగుతాయన్నారు. అక్టోబర్ 13 ఉదయం ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పూజలందుకున్న అమ్మవారి నిమజ్జనం చేస్తామని చెప్పారు.

వత్సవాయిలో ఏర్పాట్లు పూర్తి

వత్సవాయి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను నిర్వాహకులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఈ నెల 3 నుంచి జరగనున్న ఉత్సవాలకు మండలంలోని చిట్టేల వెంకటేశ్వరస్వామి, మక్కపేట అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి, అత్తిలి సారంగమతాలతోపాటు వత్సవాయిలోని వత్సవాయమ్మ తల్లి, రామాలయం, దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, మంగొల్లు, భీమవరం గ్రామాల్లో ప్రధాన సెంటర్లు, ఆలయాల వద్ద కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపనున్నారు. అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు మండపాలను అందంగా తీర్చిదిద్దే పనుల్లో నిమగ్నమయ్యారు. నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ సూచించారు.

ప్రపంచ వృద్ధుల దినోత్సవం



జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీలో ఎక్కువ కాలం సర్వీస్ చేసి 83 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లి మత్తయ్య, తాళ్లూరి పెరుమాళ్లయ్యను సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చిన మీరా, కార్యదర్శి నంబూరి చలపతిరావు, కమిటీ సభ్యులు వై.మోహనరావు, నోబెల్ బాషా, టీవీ నారాయణ, యేసు, నారికేళ్ల నాగేశ్వరరావు, పెద్దబ్బాయి, నాగమల్లేశ్వరరావు, చిన్ని, జంపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గొట్టుముక్కలలో 'పొలం పిలుస్తోంది'



గొట్టుముక్కలలో ట్రైనీ కలెక్టర్ శుభం, అనితాభాను తదితరులు

గొట్టుముక్కల(కంచికచర్ల): మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ కలెక్టర్ శుభం మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మరికొన్ని చోట్ల పత్తి పంట బాగానే ఉందని, పంటను సంరక్షించుకునేందుకు అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు. పత్తిలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా డీఏఓ కార్యాలయ అధికారి డాక్టర్ అనితాభాను, నందిగామ ఏడీఏ ఐకే శ్రీనివాస్, ఏఓ ఊర్మిళ, ఉద్యానశాఖ అధికారి నీలిమ, గ్రామీణ వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్య, రైతులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



తహసీల్దార్ రాజా కిశోర్‌ను సత్కరిస్తున్న అధికారులు

వీరులపాడు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులను ప్రజలు ఎప్పటికీ మరువరని డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు పేర్కొన్నారు. జుజ్జూరు కేంద్రంలో జల్లి ఏసోబు కల్యాణ మండపంలో పశ్చిమగోదావరి జిల్లా ఉండి భీమవరం తహసీల్దార్‌గా వెళ్తున్న రాజా కిశోర్‌ను మంగళవారం రాత్రి రెవెన్యూ సిబ్బంది పలువురు అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని పనిచేసే చోట ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ రాజా కిశోర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ సిబ్బంది అందరూ వారి శక్తి మేర పని చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా మనం కార్యాలయానికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పని చేయలని సూచించారు. మండల పరిధిలోని నాయకులు విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ పద్మావతి, ఆర్ఐ బిక్షమయ్య బాబు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిక్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా



కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 200 మొక్కలు విద్యార్థులు నాటామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం 13 రోజుల నుంచి కళాశాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి.రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు చిల్లకల్లులో ప్రజా దర్బార్

జగ్గయ్యపేట: చిల్లకల్లు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 3న ప్రజాదర్బార్ జరుగుతుందని ఎంపీడీఓ ఎం.రమేష్ బాబు మంగళవారం పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



విధులు బహిష్కరించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబూ విద్యాసాగర్, న్యాయవాదులు

నందిగామటౌన్: అడ్వకేట్ అమెండ్మెంట్ సవరణ బిల్లు సెక్షన్ 42(ఏ) బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయానికి వ్యతిరేకంగా నందిగామ కోర్టు ఆవరణలో విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన చేశామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబూ విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఎన్‌బీవీ సాగర్ మాట్లాడుతూ.. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్‌కు ప్రతి న్యాయవాది ఐదేళ్ల వకల్తా నామా దరఖాస్తు చేయాలని బిల్లులో పొందుపర్చారన్నారు. ఈ నెల 3, 4వ తేదీల్లో కోర్టు విధులను బహిష్కరిస్తామని చెప్పారు. ముందుగా బార్ అసోసియేషన్ తీర్మానం చేశామన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో విధులను బహిష్కరించి నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు షేక్ కరీముల్లా, కన్నెకంటి జీవరత్నం, మన్నెం నారాయణరావు, బొందలపాటి రామకృష్ణ, మట్టా ప్రసాద్, ఈశ్వరప్రగడ రంగారావు, ఆవల సాంబశివరావు, ఎక్కిరాల హనుమంతరావు, చెరుకుమల్లి రామారావు, పింగళి వెంకట నరసింహారావు, శివరామకృష్ణ, భాస్కరరావు, ప్రకాష్, మాశేశ్వరరావు, ఆజాద్, నంద్రు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని జంగాలకాలనీ వాసుల వినతి



తహసీల్దార్ జాహ్నవికి వినతిపత్రం అందజేస్తున్న జంగాలకాలనీ వాసులు

కంచికచర్ల: కంచికచర్ల జంగాల కాలనీలో వరద ముంపునకు గురై ఇప్పటికీ బురదలోనే జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీ వాసులు కోరారు.

ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ వి.జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కాలనీవాసులు మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షం కురిస్తే తమ కాలనీలో మోకాలు లోతు నీరు నిల్వ ఉంటుందన్నారు. తమ గుడిసెల్లో వర్షం నీరు వచ్చినా ఎవ్వరూ పట్టించుకోలేదని, తమకు ప్రభుత్వం కనీసం కేజీ బియ్యం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని మహిళలు కోరారు.

9 వరకు మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ



మాట్లాడుతున్న సీఐ గురవయ్య

తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.గురవయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ రుసుం చెల్లించాలన్నారు. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా, బ్యాంక్ చలానా, డీడీ రూపంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో అందించాలని చెప్పారు. జగ్గయ్యపేట సర్కిల్‌లో పేట మున్సిపాల్టీతో పాటు మండలం, వత్సవాయి మండలంలో మొత్తం 10 షాపులు ఉన్నాయన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా షాపుల ఎంపిక జరుగుతుందన్నారు. వివరాలకు పని వేళల్లో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల్లో దసరా సంబరాలు



పేటలోని విజ్ఞాన్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు



ధర్మవరప్పాడు తండాలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు



గండ్రాయిలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

వత్సవాయి: పాఠశాలలకు దసరా సెలవుల నేపథ్యంలో మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో దసరా సంబరాలను నిర్వహించారు. వత్సవాయి, భీమవరం, కంభంపాడు, మక్కపేట, చిన్నమోదుగపల్లి, మంగొల్లు, కన్నెవీడు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు రంగు రంగు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒక చోట పేర్చి ఆడిపాడారు. పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఆనందంగా సంబరాలు చేసుకున్నారు. బతుకమ్మలను అందంగా తయారుచేసిన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

జగ్గయ్యపేట వ్యాప్తంగా సంబరాలు

జగ్గయ్యపేట: మండలంలోని ధర్మవరప్పాడు తండా, గండ్రాయి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు రంగు రంగు పూలతో బతుకమ్మలు తయారు చేసి బతుకమ్మలాట ఆడారు. అనంతరం పండుగ విశిష్ఠతను వివరించారు. అదేవిధంగా గండ్రాయిలో చిన్నారుల బతుకమ్మ ఆటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

విజ్ఞాన్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

జగ్గయ్యపేట అర్బన్: విజయదశమి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని విజ్ఞాన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న విజ్ఞాన్ విద్యా సంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ.. మన సంస్కృతీ, సంప్రదాయాలు, మన జీవన విధానాన్ని ప్రతిబింబించేది బతుకమ్మ పండుగ అన్నారు. ప్రకృతిలో దొరికే పూలతో ఆనందంగా నిర్వహించే పండుగను అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బాలికలు బతుకమ్మలను చక్కగా అలంకరించుకొని తీసుకువచ్చారు. అనంతరం విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు దసరా నవరాత్రుల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కారులో వచ్చి మహిళ మెడలో గొలుసు చోరీ

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): కారులో వచ్చి ఓ మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారైన ఘటన గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పానుగంటి రత్తమ్మ అనే మహిళ నందిగామ వెళ్లేందుకు గ్రామంలోని సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపై వచ్చి బస్సు కోసం ఎదురుచూస్తుంది. ఈ క్రమంలో కోదాడ నుంచి ఓ కారు వచ్చి ఆమె సమీపంలో ఆగింది. కారులో నుంచి ఒక వ్యక్తి దిగి ఆమె వద్దకు వచ్చాడు. ఒంటరిగా ఉండటంతో ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కొని కారులో పరారయ్యాడు. ఇంతలో ఆమె కేకలు వేయడంతో సమీపంలోని పంట పొలాల్లో ఉన్న స్థానికులు అక్కడకు వచ్చారు. విషయాన్ని ఆమె వారికి చెప్పడంతో వారు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని సీఐ జానకీరామ్ పరిశీలించి బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన గొలుసు 20 గ్రాములు ఉంటుందని బాధితురాలు తెలిపారు.